చిత్రాలు.. అభ్యసన సాధనాలు



రసాయన మూలకాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయుడు(ఫైల్)

- ఉన్నత పాఠశాలల్లో స్టూడెంట్ లెర్నింగ్ కార్నర్లు
- బాల శాస్త్రవేత్తలను తీర్చిదిద్దడమే లక్ష్యం

కోవూరు నియోజకవర్గంలో..	
ఉన్నత పాఠశాలలు	41
విద్యార్థులు	14,694

కోవూరు : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేందుకు పాఠశాల గోడలు కొత్తరూపు సంతరించుకున్నాయి. ఉన్నత పాఠశాలల విద్యార్థులు సులభరీతిలో తెలుసుకునేలా సైన్స్, గణితం వంటి కష్టమైన సబ్జెక్టుల్లో ప్రధానమైన అంశాలను చిత్రాల రూపంలో పాఠశాలల గోడలపై చిత్రీకరించారు. దీనివల్ల ఆయా సబ్జెక్టులపై విద్యార్థులు భయం వీడి సులువుగా అర్థం చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

ఆకర్షిస్తున్న బొమ్మలు

నియోజకవర్గ పరిధిలోని ఉన్నత పాఠశాలల గోడలపై చిత్రాలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పాఠశాలల్లో స్టూడెంట్ లెర్నింగ్ కార్నర్స్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఇవి విద్యార్థుల స్వీయ అభ్యసనకు దోహదపడే విధంగా తీర్చిదిద్దారు. ప్రతి గోడా ఒక విజ్ఞానాన్ని అందించే పాఠ్యాంశంగా మార్చారు. గోడలే విద్యార్థులకు పాఠాలు చెప్పే విధంగా రూపాంతరం చెందాయి. ఇంగ్లిష్, తెలుగు, గణితం, సైన్సు, సోషల్ వంటి సబ్జెక్టుల్లో విద్యార్థుల పాఠ్యాంశాలకు అవసరమైన బొమ్మలు దర్శనమిస్తున్నాయి. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన అన్ని అంశాలు నిత్యం విద్యార్థుల కంట పడే విధంగా రూపొందించారు. దీంతో చిన్నారుల విద్యాభ్యాసం ఆకర్షణీయంగా ఆనందకర వాతావరణంలో సాగుతోంది. మండలంలోని ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా గోడలపై రూపొందించిన బోధనా చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీనిని అందంగా తీర్చిదిద్దడంలో ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయుల విశేష కృషి ఉంటుంది.



ఆహార పదార్థాల్లో విటమిన్లను తెలిపే సూచిక బోర్డు

బోధన సులభతరం

విద్యాబోధనలో అభ్యసన సామగ్రి కీలక పాత్ర వహిస్తోంది. ఇందుకోసం విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సైన్స్, గణితంలో ప్రధానమైన అంశాలను గోడలపై చిత్రీకరించాం. దీనివల్ల విద్యార్థులకు ఎటువంటి సందేహాలు వచ్చినా వెంటనే గోడలపై వాటికి సంబంధించిన అంశాలను చూసుకుని పరిష్కరించుకోవచ్చు. నిత్యసాధనకు ఉపయోగపడుతుంది.

– టి.శ్రీనివాసులు, సైన్స్ ఉపాధ్యాయుడు, ఇనమడుగు పాఠశాల

చదువుపై ఆసక్తి పెంచేలా



తరగతి గదుల్లో పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలతో పాటు వివిధ రకాల చిత్రాల వల్ల విద్యార్థులకు బోధనపై ఆసక్తి పెంచుకుంటారు. విద్యార్థులు ఒకరికొకరు సహకరించుకుని నేర్చుకుంటారు. వారిలో సృజనాత్మకత పెరుగుతుంది. సామూహిక పఠనం ద్వారా విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.


– బి.రాధారాణి, హెచ్‌ఎం, ఇనమడుగు పాఠశాల

పోటీతత్వానికి అలవాటు పడాలి



సృజనాత్మకతతో కూడిన నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోంది. అయితే బట్టీ పట్టే విధానం దూరమైతే విద్యార్థుల్లో స్వీయ అభ్యసన సామర్థ్యం పెరుగుతుంది. విద్యార్థుల్లో పోటీతత్వం అలవాటుపడుతుంది. దీని ద్వారా మంచి శాస్త్రవేత్తలు తయారవుతారు.

– ఎస్.నరసింహమూర్తి, విశ్రాంత హెచ్‌ఎం, కోవూరు



మానవ జీవక్రియను తెలిపేలా..



టెక్ విషయాలు తెలిపే బోర్డు

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు సాయంత్రం ప్రత్యేక పూజల జరిపించారు.

కాకాణి పరామర్శ



అంకోజీ యోగక్షేమాలు తెలుసుకుంటున్న కాకాణి

పొదలకూరు : మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అంకోజీను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల ఆయన వెన్నుకు సంబంధించి శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కాకాణి అంకోజీ యోగాక్షేమాలు తెలుసుకుని జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన ర్యాలీని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ నేత్రదానం ద్వారా ఇద్దరి అంధులకు కంటి చూపును ప్రసాదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ చేజర్ల సుధాకర్‌రావు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ హైమావతి, వైద్య సిబ్బంది, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు : వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కాలువల పూడికతీత పనులను ప్రారంభించినట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని వరిణి గ్రామ పంచాయతీలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొంత నిధులతో కాలువ పూడికలు తీస్తున్నామని, రైతులు రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సైకు సత్కారం



మనుబోలు : మనుబోలు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శివ రాకేష్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో రాజకీయాలకతీతంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. పార్టీ నేతలు చల్లా నవకోటి, దాసరి భాస్కర్‌గౌడ్, చలగల దయాకర్, దువ్వూరు సుధాకర్ రెడ్డి, కోసూరు కోటేశ్వరగౌడ్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న పీడీ దయాకర్

కోవూరు : ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు త్వరగా వాటిని పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ పి.దయాకర్ కోరారు. మండలంలోని గుమ్మల దిబ్బలో ఆయన మంగళవారం పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. ఆయన వెంట డీఈ వెంకటేశ్వర్లురెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ సహాయకులు ఉన్నారు.

కాంతమ్మ తల్లికి ఆరాధనోత్సవం



ప్రత్యేకాలంకరణలో కాంతమ్మ తల్లి

పొదలకూరు : మండలంలోని ఇనుకుర్తిలో ఉన్న కాంతమ్మ తల్లి ఆశ్రమంలో 25వ ఆరాధన మహోత్సవం మంగళవారం జరిగింది. ఈ క్రమంలో మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు అఖండ భజన జరిగింది. రాత్రి 8 గంటలకు గాన మంజరి, 9 గంటలకు మ్యాజిక్ షో, భరతనాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా గ్రామోత్సవం



పొదలకూరు : మండలంలోని నావూరు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని గ్రామోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా గ్రామోత్సవాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెంచలనర్సయ్య, పెంచల్ రెడ్డి, కృష్ణయ్య, పెంచలయ్య, శేషాద్రి, వై.పెంచలయ్య, పెంచలస్వామి, సుధాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

వీఏఏలకు శిక్షణ నేడు

పొదలకూరు : స్థానిక చిరుధాన్య పరిశోధనా స్థానంలో పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న వీఏఏలకు బుధవారం ఉదయం 10 గంటలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని ఏడీఏ కె.శివనాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డీహెచ్‌ఓ, నెల్లూరు డీఆర్సీ అధికారులు హాజరవుతారని తెలిపారు.

అసత్య ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు

వెంకటాచలం : భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమ అభివృద్ధిపై, ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆశ్రమ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు, భక్తులు హితవు పలికారు. మండలంలోని గొలగమూడిలో ఉన్న వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద వారు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గత నెలలో జరిగిన వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలకు వెంకయ్యస్వామి బంధువులు వస్తే తగిన మర్యాదలు చేసి, స్వామి దర్శనం చేయించినట్లు చెప్పారు. అయితే ఆరాధన సమయంలో ఆశ్రమంలోపల కొబ్బరికాయలు కొట్టడం నిషేధమని చెప్పడంతో ఆశ్రమ అభివృద్ధిపై, ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యంపై వెంకయ్యస్వామి బంధువులు అసత్య ఆరోపణలు చేయడాన్ని తాము ముక్తకంఠంతో ఖండిస్తున్నామని తెలియజేశారు. దేవుని ముందు అందరూ సమానమనే విషయం తెలుసుకోవాలన్నారు. ఏళ్ల తరబడి నుంచి వెంకయ్యస్వామి ఆశ్రమం వద్దకు రాని బంధువులు ఆరాధనోత్సవాల సందర్భంగా గొలగమూడికి వచ్చి అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతికాదన్నారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం



మనుబోలు : మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం రాత్రి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. హైదరాబాద్‌కు చెందిన భీమ్‌సింగ్, గోపికృష్ణసింగ్, శిరీష ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



కొడవలూరులో పౌష్టికాహార ప్రదర్శన



యల్లాయపాళెంలో సూచనలు చేస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి

కొడవలూరు : చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ద్వారా రక్తహీనతను దూరం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. జాతీయ పోషకాహార మాసోత్సవాల సందర్భంగా కొడవలూరు ఎన్టీఆర్ కాలనీలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార విలువలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లోనే పిల్లలకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్టీ.యాస్మిన్, ఎస్కే.రమీజా, వై.కామేశ్వరి, పి.శాంతి, ఎస్కే.అఫ్రీన్, కె.నాగరాజ పాల్గొన్నారు.

యల్లాయపాళెంలో..

యల్లాయపాళెం–2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార విలువలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపం తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ మేరి హెబ్సిబా, వెల్ఫేర్ సహాయకుడు కె.మల్లికార్జున, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత



విడవలూరు : మండలంలోని ముదివర్తి సమీపంలో కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని గ్రామస్తులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో కోళ్ల వ్యర్థాలను పూడ్చిపెట్టారు. అనంతరం వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



కొడవలూరు : ఆశా కార్యకర్తలకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

కొడవలూరు : సీజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదముందన్నారు. గ్రామాల్లో అపరిశుభ్ర ప్రాంతాలుంటే దోమల నివారణకు మలాథియాన్ స్ప్రే చేయాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటి సర్వే చేసి గర్భిణులను గుర్తించడంతో పాటు వారు క్రమం తప్పకుండా వైద్యశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఆయా గ్రామాల్లోని వైద్య సిబ్బందిపైనే ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఏర్పాటు చేసిన 'మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ యూనిట్'ను వీలైనంత ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న హాస్పిటల్ భవన స్థలాన్ని ఆయన పరిశీలించారు. సమావేశంలో వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, పి.కావ్య, డి.జనార్ధన్, ఏఎంఓ నాగార్జునరావు, హెచ్‌ఈఈఓ నరసింహారావు, ఎస్‌యూఓ నాగరాజు, హెచ్‌ఈఓ కోటేష్, హెచ్‌ఎస్‌లు, హెచ్‌ఏలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



మనుబోలు : మాట్లాడుతున్న డాక్టర్ మొహిసినా సుల్తానా

మనుబోలు : ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మొహిసినా సుల్తానా వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర రోగాలు ఎక్కువగా నమోదవుతున్నందున ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున దోమలు, ఈగల వల్ల వ్యాప్తి చెందే ఫైలేరియా, మలేరియా, చికెన్ గున్యా, కలరా తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ల్యాబ్ కిట్ల కొరత ఉంటే వెంటనే ఇండెంట్ పెట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓ రాజయ్య, పీహెచ్‌ఎస్ జయశీల, హెల్త్ సూపర్‌వైజర్‌లు వెంకటరమణయ్య, హైమావతి తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలకు డిమాండ్



మాట్లాడుతున్న బాధితులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : గత ప్రభుత్వంలో తమకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, కొద్ది నెలలుగా కాంట్రాక్టర్ శేషయ్య ఇళ్ల నిర్మాణాల విషయంలో అలసత్వం వహిస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని స్థానిక గాంధీనగర్‌లో ఉంటున్న పందుల పెంపకందారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం మాట్లాడారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలతో పాటు తమ వద్ద అదనంగా పొదుపు రుణం రూ.30 వేలు, మరి కొందరి దగ్గర రూ.60 వేలు తీసుకుని ఇంతవరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేదని ఆరోపించారు. ప్రస్తుతం కమిషనర్ ఇక్కడి నుంచి ఖాళీ చేయమంటే తాము ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నిత్యావసర ధరలను తగ్గించాలి



ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

ముత్తుకూరు : మార్కెట్‌లో రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం తక్షణం తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి తుంగా ఏడుకొండలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ముత్తుకూరులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 50 సంవత్సరాలు నిండిన మహిళలకు పింఛన్ అందజేయాలన్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, మత్స్యకారేతర ప్యాకేజీ రాని వారిని గుర్తించి వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

తగిన జాగ్రత్తలు పాటించాలి

- ఆత్మ పీడీ శివన్నారాయణ



వరిగొండలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు : వరిపైరును నాశనం చేసే కాండం తొలుచు పురుగు విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ సూచించారు. మండలంలోని వరిగొండ గ్రామంలో ఖరీఫ్ వరి పంటను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ క్రమంలో వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించినట్లుగా గుర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు ఆశాజనకంగా ఉందన్నారు. పంట కోత దశలో సోకిన తెగుళ్లకు రసాయన ఎరువులను పిచికారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. వరిలో నానో యూరియాను వాడితే సత్ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజ్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు శివజ్యోతి, అనూష, మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, గ్రామ సహాయకుడు సుమంత్ పాల్గొన్నారు.